# పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి రచనలు

## సమగ్ర పరిశీలన





డా॥ మొదతోటి సంగీత రావు

డా॥ జి. అరుణకుమారి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు - స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ - 46.

# పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి - సాహితీ సౌరభాలు

'పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి రచనలు - సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టాను పొందిన డా॥ ఎమ్. సంగీతరావును అభినందిస్తున్నాను.

జీవితాన్ని సార్థకం చేసుకున్న తెలుగు సాహిత్య దంపతులలో శ్రీమతి రాజ్యలక్ష్మి గారు, పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి గారు ఒకరు. పెళ్ళిలో కొత్త వధూవరులు తలంబ్రాలు పోసుకునేటప్పుడు సరదాగా పోటీ పడినట్లుగా ఈ దంపతులు రచనలు చేసేటప్పుడు పోటా పోటీలుండేవి. రాజ్యలక్ష్మి గారు 'పాపం మగాళ్ళు' అనే వ్యాసం రాస్తే మూర్తి గారు 'ఆడవారిదే పై చేయి' అనే వ్యాసం రాసారు. ఆయన ప్రేమాయణం అనే నవల రాస్తే రాజ్యలక్ష్మి గారు ప్రేమాలయం అనే నవల రాసారు. జీవిత సాహచర్యంలో అనేక కవితలు, కథలు, నవలలు, నవలికలు రూపొందించారు. ఎన్నుకున్న కథావస్తువులు వేరైనా గమ్యం మాత్రం ఒక్కటే. అది సంప్రదాయం, ఆధునిక భావాల సమ్మేళనం వీరి రచనలలో కనిపించే సౌకుమార్యం వారి జీవితాచరణలోనూ కనపిస్తుంది.

నిత్య జీవితంలో తన చుట్టూ జరిగే సంఘటనలను సామాన్య రీతిలో చమత్కార యుక్తంగా ఆనాటి ఈనాటి మంచి చెడులను విశ్లేషిస్తూ అనేక కథలు రాసారు. కథలు రాసేసి కవితలల్లేసి కన్నెర్ర జేసేసి సమాజంలో ఉన్న కుళ్ళును క్షాళనం చేయలేమని, వాటిని చదువుకుని ఆనందించవచ్చుని, కష్టాలు కన్నీళ్ళు బరువులు, బాధలలో తాదాత్మ్యం పొందవచ్చునేది వీరి విశ్వాసం.

తమదైన శైలిలో సాధికారతతో పఠిత హృదయానికి హత్తుకునేట్టు కథలు మలచటంలో సిద్ధహస్తులు. వీరి దృష్టిలో కథ ముడి వజ్రమైతే కథానిక సానపట్టిన వజ్రం వంటిది. కథా నిర్మాణంలో పటిష్టత, పాత్ర చిత్రణలో స్పష్టత, శైలిలో ప్రత్యేకత, సంభాషణలలో సహజంగా సాగిపోయే పదాలతో రచనకు ఒక ప్రయోజనం కనిపిస్తుంది. ఆర్.కె. నారాయణన్ కథల్లో పండించిన హాస్యం వీరి కథల్లోను కనిపిస్తుంది.

పాఠకులలో అవగాహననీ ఆలోచనల్నీ పెంచే కాన్షియస్ నవలలు రాసారు. గతాన్ని గురించి చింతించటం రేపటి గురించి ఆలోచించటం తగ్గించి వర్తమానంలో ఉన్నతంగా ఆలోచించి ఆచరించడం వలన మనిషి హాయిగా జీవించవచ్చునే ఆంతర సత్యాన్ని 'పొత్తుల బావి' నవలలో సూచించారు. గతం ఒక అనుభవం వర్తమానం ఒక అలజడి భవిష్యత్తు ఒక ఆశారేఖ అని మూడు తరాల కథని సమకాలీన వ్యవస్థకు ప్రతీకగా మలిచారు.

ప్రజల మనస్తత్వాలు, శ్రీ పాద కృష్ణమూర్తి, విశ్వనాథ, నండూరి, ఆరుద్ర వంటి రచయితల రచనల్లో సామాజిక సాహిత్య స్థితి గతులకు ప్రతిబింబం పోలాప్రగడ వారి ఆ రోజుల్లో... ఆత్మకథ.

డా॥ సంగీతరావు మూర్తిగారి రచనలను, సాహితీ నేపథ్యాన్ని సమగ్రంగా అందించారు. మూర్తి గారు చేపట్టని ప్రక్రియ అంటూ లేదు. ఆయా ప్రక్రియలపై ప్రత్యేకంగా పరిశోధన చేయాల్సిన అవశ్యకత ఉంది.